నలుగురు బక్కవాళ్ళు.

బతికి చెడ్డవాళ్ళు.

బతకలేక బడిపంతుళ్ళయినవాళ్ళు.

ఫిరంగిపురంలో రైలు దిగి డొంకలో పరుగు పరుగున నడుస్తున్నారు, చూపులు మబ్బులోకి చొప్పిస్తూ, ఆశలు ఆకాశంలో నిలుపుకుంటూ.

వాళ్ళు పంతుళ్ళే! వాళ్ళ అవతారాలే చెప్తున్నాయి. మాసిన కండువాలు పెరిగిన గడ్డాల వెనక వెలుగుతున్న జ్ఞాన నేత్రాలు.

పెళ్ళాలకి నగలు చేయించలేక, కూతుళ్ళకి పెళ్ళిళ్ళు చేయలేక ఉదయాస్తమయాలు పాఠం చెప్పడం తప్ప మరేమీ చేతకానివారు వారు. నాలుగక్షరాలు చెప్పుకుని బతికేస్తున్నారు గదా అని నానా మాటలు అంటే పడేందుకు సిద్ధంగా లేరు. వాళ్ళు మానధనులు.

అంతే జరిగింది.

జీతమిస్తున్నానన్న ధీమాయో ఏమో కరస్పాండెంటు క్లాసు రూంలోకి హఠాత్తుగా వచ్చాడు. పంతులు పాఠం చెప్పడం మధ్యలో ఆగిందే అని బాధపడుతూ

## మళ్ళీ అమరావతి కథలు

### సత్యం శంకరమంచి

కుర్చీలోంచి లేవడం కొంచెం ఆలస్యం చేశాడు. కరస్పాండెంటు కళ్ళు నిప్పులయిపోయి "ఆ బవిరిగడ్డ వేమిటి?" అని ఎద్దేవా చేశాడు.

పంతులు చేతులు ముకుళించి "మా ఆవిడ నీళ్ళోసుకుందండి" అన్నాడు. కరస్పాండెంటు ఓ వెటకారం నవ్వు విసిరి "ఆ చిరుగుల ఉత్తరీయం ఏవిటి?" అని మళ్ళీ పొడిచాడు.



జ్ఞాన నేత్రం

వానపాములాంటి పంతులు కోడె తాచయాడు.

"తమరిచ్చే జీతపు రాళ్ళకి పట్టు బట్టలు రావండీ!" అన్నాడు.

కరస్పాండెంట్ వెర్రెత్తిపోయి "తమకు పట్టు బట్టలు కావాలేం? ఇంతోసి పండితులకి, ఇంతోసి మేధావులకి మేమిచ్చేది జీతపు రాళ్ళయినాయా ఏం..." అంటూ అనరానివన్నీ అని గుమ్మం దాటి పోయాడు.

ఇలాంటి సన్మానమే మరో ముగ్గురు పంతుళ్ళకయింది. స్కూలయింతర్వాత నలుగురూ చెట్టుకింద సమావేశమయి బావిలో దూకి చద్దామా లేక కాలవలో దూకుదామా అని సమాలోచనలు జరుపుతుంటే ఒకరన్నారు. "చదువురాని ఈ దేశంలో అక్షర జ్ఞానమిచ్చేవాడు అడుక్కుతినడయ్యా! మనకు చచ్చే ఖర్మమేమి? మనకు మేడలూ మిద్దెలూ అక్కర లేదు. చదువు చెప్పేవాణ్ణి చెప్పెట్టి కొట్టే చోట మనకి స్థానం లేదు. ఎక్కడకయినా వెళ్ళి మన బడి మనమే పెట్టుకుందాం పదండి" అందరూ ఉత్తరీయాలు దులుపుకు లేచారు. ఎవరో కుర్రాడితో వూరెడుతున్నాం అని ఇళ్ళకి కబురు చేశారు. ప్రయాణమయ్యారు.

పరుగు పరుగున అమరావతి చేరుకున్నారు. కృష్ణలో స్నానం చేశారు. దేవుడికి సాగిలపడ్డారు. గుడి నీడలో కూర్చుని గోపుర శిఖరాల మీంచి వూరుని కలియ చూశారు.

ఎంత చల్లటి గడ్డ!

ఏనాటి మట్టి?

బొద్ధ విశ్వవిద్యాలయం మెట్టిన చోటు!

'ఇక్కడే బడి' అని సంకల్పించి నాలుగు రోడ్ల కూడలికి వచ్చి, నలుగురినీ చేరదీసి ఈ వూళ్ళో స్కూలు స్థాపిస్తామన్నారు. విస్తుపోయారు గ్రామజనులు. మన వూరేమి? ఇంగ్లీషు చదువేమి? ఈ పరగణాలో ఎక్కడ్లా స్కూలు లేదే! ఆ రాత్రికి భోజనం ఏర్పాటు చేశారు పంతుళ్ళకి.

మర్నాడు ఓ ఇంటి వరండాలో స్కూలు స్థిరపరిచారు. ఇంటింటికి తిరిగి బిచ్చమెత్తినట్టు "అయ్యా మీ పిల్లవాళ్ళే స్కూలుకు పంపండి. మేం పాఠాలు చెప్తాం. మేం వృద్ధిలోకి తీసుకొస్తాం" అని ప్రార్థించారు.

పిల్లలు చేరారు!

కొత్త చదువు!

కొత్త పాటలు!

చుట్టుప్రక్కల పదిహేను మైళ్ళ దూరం నుంచి పిల్లలు రావటం మొదలెట్టారు. ఆ పరగణా అంతా జ్ఞాన సంచలనం!

కొంతకాలం రహస్యంగా స్కూలు నడిపారు పంతుళ్ళు. ఆ పైన బహిరంగంగానే "మాదీ ఈ బడి" అన్నారు.

ఎక్కడ పుట్టారో ఎక్కడ పెరిగారో ఈ గడ్డన చదువుల తల్లిని దింపి వందల మంది కుర్రల్ని

## ముత్యాలవాన

వ్యక్తుల్ని చేశారు. ఆ పరగణా అంతా అక్షర కాంతి పంచారు. జ్ఞాన జ్యోతి అంతా విస్తరించింది. జ్ఞాన క్షేత్రం పుష్కలంగా పండుతోంది. ఆ క్షేత్రం చుట్టూ నాలుగు పక్కలా నలుగురు పంతుళ్ళు ఎదిగి వచ్చిన పంట చూసి నవ్వుతూ కన్నీళ్ళు రాలుస్తున్నారు. వాళ్ళకి పెళ్ళాల నగలూ, కూతుళ్ళ పెళ్ళిళ్ళు పట్టేలేదు. ■

### లాంతరు

రాత్రి పొలానికి కాపలా వున్న పాలేరు పుల్లయ్య లాంతరుతో ఎటో వెళుతున్నాడు. యజమాని సుబ్బయ్య అడిగాడు-

"ఎక్కడికిరా వెళుతున్నావు?"

"నా ప్రేయురాలిని కలుసుకోడానికి అయ్యా!"

"అలా నేను ఎప్పుడూ ప్రేయసిని కలుసుకోడానికి లాంతరుతో వెళ్ళలేదురా, పిచ్చోడా!"

"మీకు అయితే లాంతరు అవసరం లేదు అయ్యా, ఎవరైనా పరవాలేదు, నాకు అలా కాదు నా ప్రేయసే కావాలి."

— ఇ.వి. రమణ

### స్టైల్స్

"ఏ కటింగ్ చేయమంటార్సార్?" కుర్చీలో కూర్చున్న చలపతినడిగాడు బార్బర్.

"నీ ఇష్టం. నీకేది బాగా వస్తే అది చెయ్" చెప్పాడు చలపతి.

"నాకు గుండు చెయ్యడం బాగొచ్చండి. అదే చేయమంటారా?" వినయంగా అడిగాడా బార్బర్.

—ఎ.వి.ఆర్. ప్రసాద్, నెల్లూరు